andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
సోమవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 35.9 : కనిష్ఠం 26.5
నిర్మల్ జిల్లా వార్తలు
8
మంగళవారం 18 జూన్ 2024



ఖానాపూర్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఇదే ..



కుబీర్ మార్కెట్ కమిటీ కార్యాలయం

- రిజర్వేషన్‌లు ఖరారవ్వడంతో కాంగ్రెస్ నేతల హడావిడి
- నిర్మల్, భైంసా ఓ.సీలకు, ఖానాపూర్, కుభీర్ ఎస్సీలకు, సారంగాపూర్ బీ.సీలకు కేటాయింపు
- మూడు నాలుగు రోజుల్లో నియామక ఉత్తర్వులు వెలువడే అవకాశం
- సీనియర్ నేతల చుట్టూ ఆశావహుల చక్కర్లు
- కేడర్‌లో కోలాహలం

మార్కెట్ కమిటీలపై నేతల నజర్!



నిర్మల్ మార్కెట్ కమిటీ కార్యాలయం ఇదే ..

నిర్మల్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పరిధిలోని ఐదు మార్కెట్ కమిటీ పాలకవర్గాలకు సంబంధించిన రిజర్వేషన్‌లు ఖరారు కావడంతో కాంగ్రెస్ పార్టీ నేతలంతా చైర్మన్, డైరెక్టర్ పదవులను దక్కించుకునేందుకు తమ ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. ఏళ్ల నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతున్నప్పటికీ ఇప్పటి వరకు ఏ ఒక్క పదవిని కూడా దక్కించుకోలేని సీనియర్ నేతలు ఈ సారి ఎలాగైనా ఏదో ఒక పదవిని దక్కించుకోవాలని పట్టుదలతో ఉన్నారు. ఎట్టకేలకు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో వీరంతా పదవులపై తమ ఆశలను రెట్టింపు చేసుకున్నారు. ఈ సారి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని చేపట్టేందుకు ఆయా మార్కెట్ కమిటీల పరిధిలోని సీనియర్ నాయకులు తమ వంతు ప్రయత్నాలను ముమ్మరం చేస్తున్నారు. నిర్మల్ జిల్లాలో మొత్తం ఐదు మార్కెట్ కమిటీలు కొనసాగుతుండగా ఆ కమిటీలకు చైర్మన్, డైరెక్టర్ పదవులను నియమించనున్నారు. దీనికి సంబంధించి రోస్టర్ పద్దతిలో మార్కెట్ కమిటీల పాలకవర్గాలకు రిజర్వేషన్‌లు కూడా ఖరారయ్యాయి. కొద్దిరోజుల క్రితమే వ్యవసాయ మార్కెటింగ్ శాఖ ఉన్నతాధికారులకు ఈ రిజర్వేషన్‌లను ఖరారు చేస్తూ ఉత్తర్వులు వెలువరించారు. దీంతో చైర్మన్, డైరెక్టర్ పదవుల నియామక ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్లయ్యింది. కాగా నిర్మల్, భైంసా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులు ఓ.సీ జనరల్‌కు రిజర్వ్‌కాగా కుభీర్, ఖానాపూర్ మార్కెట్ కమిటీలు ఎస్సీలకు రిజర్వ్ అయ్యాయి. ఒక్క సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవి మాత్రం బీ.సీలకు రిజర్వ్ కావడంతో ఆ వర్గాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు చైర్మన్ పదవిని దక్కించుకునేందుకు పట్టుబడుతున్నారు. నిర్మల్ నియోజకవర్గ పరిధిలోని నిర్మల్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుపై ఆశావాహులంతా ఒత్తిడి కొనసాగిస్తున్నారు. అలాగే భైంసా, కుభీర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవుల కోసం అక్కడి నియోజకవర్గ ఇన్‌చార్జీ, మాజీ ఎమ్మెల్యే నారాయణరావు పటేల్‌పై ఒత్తిడి తీసుకువస్తుండగా ఖానాపూర్ మార్కెట్ చైర్మన్ పదవి కోసం అక్కడి ఎమ్మెల్యే వెడ్మబొజ్జు చుట్టూ ఆశావాహులంతా చక్కర్లు కొడుతున్నారు. అయితే జిల్లాలోని ఈ ముగ్గురు నేతలు ఏ ఒక్కరికీ స్పష్టమైన హామీని ఇవ్వకుండా అధిష్టానం సీనియారిటీ, సీన్సియారిటీని ప్రాతిపదికన చేసుకొని పదవుల కోసం ఎంపిక చేస్తుందని చెబుతున్నారు. వాస్తవానికి ఆయా నియోజకవర్గాల ఇన్‌చార్జీలు సూచించిన వారికే మార్కెట్ చైర్మన్, డైరెక్టర్ పదవులు దక్కనున్నాయన్నది బహిరంగ రహస్యమే. ఒక్కో మార్కెట్ కమిటీ పరిధిలో పదవులను ఆశిస్తున్న వారి సంఖ్య ఎక్కువగా ఉన్న కారణంగా ఎంపిక వ్యవహారం అక్కడి ఇన్‌చార్జీలకు తలనొప్పిగా మారే అవకాశం ఉందని అంటున్నారు. ఇప్పటికే చాలా మంది సీనియర్ నాయకులు ఈ పదవులపై ఆశలు పెట్టుకున్న కారణంగా తాము ఎవరిని ఎంపిక చేయాలోననే అంశంపై ఇన్‌చార్జీ నేతలు మల్లగుల్లాలు పడుతున్నారంటున్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలోని చాలా చోట్ల మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులను భర్తీ చేసినప్పటికీ నిర్మల్ జిల్లాలో మాత్రం ఈ ప్రక్రియ మొదలుకాలేదు. రిజర్వేషన్‌లు ఖరారు కావడంతో నాలుగైదు రోజుల్లో మార్కెట్ పదవుల ఎంపికకు సంబంధించి ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసే అవకాశాలున్నాయంటున్నారు. ఇప్పటికే చైర్మన్ పదవులు, డైరెక్టర్ పదవులకు సంబంధించిన అర్హులైన వారి జాబితా రూపొందిందని ఈ జాబితా జిల్లా ఇంచార్జీ మంత్రి సీతక్క వద్ద ఉందని అంటున్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జీలు పంపిణీ జాబితానే ఇంచార్జీ మంత్రి సైతం ఒకే చెప్పనున్నారంటున్నారు.


రాంరెడ్డి

నిర్మల్ మార్కెట్ చైర్మన్ పదవిపై పోటాపోటీ


భీంరెడ్డి

జిల్లా, నియోజకవర్గ కేంద్రంగా కొనసాగుతున్న నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపైనే ప్రస్తుతం అందరి దృష్టి కేంద్రీకృతమవుతోంది. దాదాపు ఎమ్మెల్యేస్థాయిలో ఉండే నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిపై కాంగ్రెస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులంతా కన్నేశారంటున్నారు. పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచే కొంతమంది ఆశావాహులు డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావు దృష్టికి ఈ విషయాన్ని తీసుకువెళ్ళారని అంటున్నారు. తమ సీనియారిటీ, సీన్సియారిటీని పరిగణలోకి తీసుకొని చైర్మన్ పదవిని తమ కు కేటాయించాలని కోరుతున్నారు. డీసీసీ అధ్యక్షులు శ్రీహరిరావుకు సన్నిహితులైన మేడిపెల్లి భీంరెడ్డి, రత్నాపూర్ కాండ్లి మాజీ సర్పంచ్ రాంరెడ్డి, గుండంపెల్లి సాగర్‌రెడ్డి, సిద్దిలకుంట నర్సారెడ్డి, డీసీసీ మాజీ ఉపాధ్యక్షులు అజర్‌లతో పాటు తదితరులు నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్న వారిలో ముందున్నారు. శ్రీహరిరావుకు చాలా ఏళ్ల నుంచి మేడిపెల్లి భీంరెడ్డి, రత్నాపూర్ కాండ్లి రాంరెడ్డిలు అత్యంత సన్నిహితులుగా కొనసాగుతున్నారు. కష్టకాలంలో సైతం వీరు శ్రీహరిరావు వెంట కొనసాగారని చెబుతున్నారు. వీరితో పాటు గుండంపెల్లి సాగర్‌రెడ్డి, నర్సారెడ్డి, అజహర్ అలాగే లక్ష్మణచాంద రవీందర్‌రెడ్డిలు కూడా ఈ పదవిని ఆశిస్తున్నారు. వీరు కూడా శ్రీహరిరావుకు సన్నిహితులుగానే ఉన్నారు. అయితే సీనియర్ నేతలతో పాటు తనకు సన్నిహితులైన వీరందరిలో ఒక్కరిని మాత్రమే చైర్మన్ పదవిని ఎంపిక చేయాల్సి ఉండడం శ్రీహరిరావు ఎటూ తేల్చుకోలేకపోతున్నారంటున్నారు. అయితే శ్రీహరిరావు చాకచక్యంగా వ్యవహరించి వీరందరి మధ్య సయోధ్య కుదిర్చిన తరువాతనే చైర్మన్ పదవిని ఖరారు చేయనున్నట్లు సమాచారం. పదవులను ఆశించిన వారికి ఇతర నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పిస్తామని శ్రీహరిరావు స్పష్టమైన హామీనిచ్చి రాజీ ఫార్ములాను అమలు చేసే అవకాశం ఉందంటున్నారు.

మిగతా మార్కెట్ పదవులకు సైతం తీవ్ర పోటీ

కాగా ఖానాపూర్, భైంసా, కుభీర్, సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవులకు తీవ్రమైన పోటీ నెలకొందని అంటున్నారు. భైంసా ఓ.సీ జనరల్‌కు రిజర్వ్ కావడంతో పదవిని ఆశిస్తున్న వారి సంఖ్యలో గణనీయంగా పెరిగిపోయిందని అంటున్నారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులైన ఆనంద్‌రావు పటేల్, ఓం ప్రకాష్‌లడ్డాలతో పాటు తదితరులు నియోజకవర్గ ఇన్‌చార్జీ నారాయణరావు పటేల్‌పై ఒత్తిడి తీసుకువస్తున్నారని సమాచారం. అయితే దీర్ఘకాలం నుంచి కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ ఇన్‌చార్జీ నారాయణరావుపటేల్‌కు సన్నిహితునిగా ఉన్న ఆనంద్‌రావు పటేల్ పేరు చైర్మన్ పదవికి ప్రముఖంగా వినిపిస్తోంది. కాగా ఎస్సీకి రిజర్వ్ అయిన కుభీర్ ఎయంసీ చైర్మన్ పదవిపై కూడా సీనియర్ నాయకులు శంకర్ చంద్రే, జి. కల్యాణ్, గోరేకర్‌బాబు, సతీశ్, రమేష్‌లు పోటీలో ఉన్నారు. వీరంతా ఇప్పటికే మాజీ ఎమ్మెల్యే నారాయణ రావు పటేల్‌కు చైర్మన్ పదవి కోసం తమ పేరును పరిశీలించాలని విన్నవించారు. సారంగాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవికి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ దశరథ రాజేశ్వర్, స్వర్ణ గ్రామ మాజీ సర్పంచ్ అబ్దుల్ ఆది, సీనియర్ నాయకులు, ఉద్యమకారుడు బొల్లోజి నర్సయ్యల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నారు. ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఎస్సీలకు రిజర్వ్ కావడంతో ఆ వర్గానికి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకులు పోటాపోటీగా పట్టుబడుతున్నారు. ప్రధానంగా ఖానాపూర్ మండలం నుంచి కట్ట శ్రీనివాస్, రాజేశ్వర్, మైస శ్రీనివాస్, నేరేళ్ళ సత్యనారాయణ, గొర్రె గంగాధర్, జన్నారపు శంకర్‌లు ఈ పదవిని ఆశిస్తున్న వారిలో ముందున్నారు. అలాగే కడెం మండలం నుంచి బొడ్డు గంగన్న, జడ ఇందూర్, దుర్గభవాని, చెనిగారపు కమాలాకర్, పడిగెల భూషణ్, శంకర్, పెంబి మండలం నుంచి మల్లెపెల్లి స్వామి, దస్తూరాబాద్ మండలం నుంచి దుర్గం మల్లేష్‌లు ఖానాపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ఆశిస్తున్నారు. అయితే ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జు సూచించిన వారికే ఆ చైర్మన్ పదవి దక్కనుంది.

(ఆంధ్రజ్యోతి, నిర్మల్)

కదిలి పాపహరేశ్వర స్వామిని

దర్శించుకున్న జిల్లా న్యాయాధికారి


న్యాయాధికారికి స్వామివారి ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

దిలావర్‌పూర్, జూన్ 17 : మండలంలోని శ్రీ కదిలి పాపహరేశ్వరస్వామిని సోమవారం జిల్లా అడిషనల్ జూనియర్ జోగినపల్లి భవిష్య దర్శించుకున్నారు. శ్రీ పాపహరేశ్వర స్వామికి అభిషేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ మాతాన్నపూర్ణేశ్వరి దేవికి కుంకుమార్చన పూజతో పాటు ఇతర ప్రత్యేకపూజలు చేశారు. పద్దెనిమిది వృక్షాలతో కూడిన మహా వృక్షం దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాశస్త్యాన్ని దేవస్థానం అర్చకులను అడిగి తెలుసుకున్నారు. దేవస్థానం అర్చకులు జిల్లా అదనపు జూనియర్ సివిల్ జడ్జి భవిష్యకు స్వామివారి ప్రసాదం అందజేసి ఆశీర్వదించారు. దేవస్థానం చైర్మన్ వెంకట్‌రావు, పాలకవర్గం సభ్యులు ఉన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం


ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

నిర్మల్ చైన్‌గేట్, జూన్ 17 : కొమరం భీం జిల్లాలో ఆసిఫాబాద్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాటశాలకు చెందిన 1997-98 10వ తరగతి పూర్వ విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనాన్ని నిర్వహించుకున్నారు. మండల కేంద్రంలోని ఫంక్షన్‌హాల్‌లో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో చదివిన నాటి మధుర స్మృతులను నెమరు వేసుకున్నారు. అనంతరం గ్రూప్ ఫోటోలు దిగి, సామూహిక భోజనాలు చేశారు. 26 సంవత్సరాల తరువాత కలిసి చదివిన మిత్రులంతా ఒకచోట కలుసుకోవడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. యోగ క్షేమాలను ఒకరినొకరు అడిగి తెలుసుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉల్లాసంగా గడిపారు.

అవోపా నూతన కార్యవర్గం ఏర్పాటు



అవోపా నూతన కార్యవర్గ సభ్యులు

నిర్మల్ కల్చరల్, జూన్ 17 : నిర్మల్ జిల్లా ఆర్యవైశ్య అఫీషియల్, ప్రొఫెషనల్ ఉద్యోగ సంఘ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏర్పాటు చేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా మోరేశ్వర్ గుప్తా, జోన్ చైర్మన్‌గా మంత్రి శ్రీనివాస్ గుప్తా, సెక్రటరీగా పోలిశెట్టి విలాస్ గుప్తా, జిల్లా అధ్యక్షుడిగా గాదె దయానంద్ కుమార్, ప్రధాన కార్యదర్శిగా ఏ. వెంకట రమణ, కోశాధికారిగా కొమ్మ సంతోష్ గుప్తా, మహిళా అధ్యక్షురాలిగా శ్రీమాల, ప్రధాన కార్యదర్శిగా మాధవిలత ఎన్నికయ్యారు. పట్టణ అధ్యక్షుడిగా జొన్న వినోద్, ప్రధాన కార్యదర్శిగా టి. నారాయణ, ఇతర కార్యవర్గ సభ్యులు ఎన్నికయ్యారు. రాష్ట్ర అధ్యక్షుడు పి. శంకర్, ప్రధాన కార్యదర్శి పోలా శ్రీధర్, తదితరులు పాల్గొని వారిచే ప్రమాణ స్వీకారం చేయించారు.

బాసరకు 'మహా' జనం

- స్వామి సమర్థ గురుదేవ్ సంస్థ ఆధ్వర్యంలో అమ్మవారి నిలయంలో విద్యా సరస్వతీ పూజ


కార్యక్రమానికి హాజరైన మహారాష్ట్ర భక్తులు


మాట్లాడుతున్న స్వామి సమర్థ గురుదేవ్ ధార్మిక సంస్థ స్వామిజీ

బాసర, జూన్, 17 : మహారాష్ట్ర భక్తులతో బాసర సరస్వతీ అమ్మవారి క్షేత్రం జనసంద్రంగా మారింది. మహారాష్ట్రకు చెందిన శ్రీస్వామి సమర్థ గురుదేవ్ సంస్థ ఆధ్వర్యంలో అమ్మవారి నిలయంలో విద్యా సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయానికి సమీపాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి శ్రీ స్వామి సమర్థ గురుదేవ్ ధార్మిక సంస్థ స్వామిజీ హాజరై భక్తులచే సరస్వతీ అమ్మవారి పూజ జరిపించారు. ఆది, సోమ రెండు రోజుల పాటు జరిగిన ఈ కార్యక్రమానికి మహారాష్ట్ర నలుమూలల నుంచి భక్తులు హాజరయ్యారు. వచ్చిన భక్తులకు బ్యాచ్‌ల వారీగా పూజలు జరిపించారు. భక్తులు ధనిక, పేద అనే తేడా లేకుండా తమ సొంత ఖర్చులతో బాసర చేరుకొని గురూజీ పూజల్లో పాల్గొన్నారు. అనంతరం సరస్వతీ అమ్మవారి దర్శనం కోసం బారులు తీరారు. మహారాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన భక్తులతో బాసర దారులన్నీ కిక్కిరిసి పోయాయి. ఎటు చూసినా వాహనాలు, భక్తుల రద్దీ కిక్కిరిసి కనిపించింది.

ప్రముఖుల హాజరు

ఈ కార్యక్రమానికి పలువురు ప్రముఖులు హాజరయ్యారు. మహారాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి అశోక్‌రావు చవాన్, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్‌తో పాటు మహారాష్ట్రకు చెందిన వివిధ ఉన్నతస్థాయి అధికారులు, ప్రము ఖులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. అనంతరం సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమం సందర్భంగా ముథోల్ సీఐ మల్లేషం, బాసర ఎస్సై గణేష్ ఆధ్వర్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.


స్వామిజీ ఉపన్యాసాన్ని వింటున్న భక్తులు


అమ్మవారిని దర్శించుకుంటున్న మహారాష్ట్ర మాజీ సీఎం అశోక్‌చవాన్

పలకరించిన తొలకరి.. పులకరించిన రైతు


సోయా విత్తుతున్న రైతు


పత్తి విత్తుతున్న దృశ్యం

ముథోల్, జూన్ 17 : ముథోల్ మండల వ్యాప్తంగా ఆదివారం రాత్రి తొలకరి వర్షం పలకరించింది. దీంతో రైతు పులకరించిపోయాడు... ఎప్పటి నుండో వరుణుడి కరుణ కోసం, వర్షం రాక కోసం ఎదురుచూస్తున్న రైతన్నల కళ్లలో కోటి కాంతులు మెరిశాయి. మృగశిర కార్తె ప్రారంభమై పది రోజులు కావస్తున్నా వర్షం కురియకపోవడంతో రైతులు దిగులు చెందారు. వర్షం కోసం గ్రామ దేవతలకు పూజలు సైతం చేశారు. ఎట్టకేలకు ఈ భారీ వర్షం అన్నదాతలను సంబర పరిచిందని చెప్పుకోవచ్చు. దీంతో సోమవారం రైతన్నలు నాగళ్ల చేతబట్టి, ఇదివరకే చెత్తా చెదారం ఏరి, శుభ్రం చేసుకున్న చేలలో దుక్కులు దున్నుకుంటూ విత్తనాలు పెట్టేందుకు చేను బాట పట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ... ఈ సారికే వర్షాలు కురిసి, విత్తులు విత్తాల్సి ఉండగా వరుణుడి కరుణ లేక వర్షం రాకపోవడంతో ఇన్ని రోజులు ఆగాల్సి వచ్చిందని, వర్షం రాకతో వ్యవసాయ పనులు ప్రారంభించామని తెలిపారు. మరికొందరు రైతులు ఇది వరకే పొడి నేలలో విత్తనాలు విత్తారు. ఏది ఏమైనా ఈ వర్షం రైతులకు ఆనందపరిచింది.

సంక్షిప్త సమాచారం

జిల్లా కేంద్రంలోని దివ్యనగర్ ఫీడర్ పరిధిలో

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నిర్మల్ కల్చరల్, జూన్ 17 : నిర్మల్ పట్టణంలోని దివ్యనగర్ ఫీడర్ పరిధిలో చెట్ల తొలగింపు సందర్భంగా మంగళవారం ఉదయం 9 నుండి 11 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏడీఈ పి. రవి ఒక ప్రకటనలో తెలిపారు. దత్తాత్రేయనగర్, దివ్యనగర్, అయ్యప్ప ఆలయం, శాస్త్రీనగర్, ఏఎన్ రెడ్డి కాలనీ ప్రాంతవాసులకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందన్నారు.

ఘనంగా బక్రీద్ వేడుకలు


ఖానాపూర్‌లో ముస్లింకు బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుతున్న మున్సిపల్ చైర్మన్ సత్యం

ఖానాపూర్, జూన్ 17 : మండల కేంద్రంలో సోమవారం బక్రీద్ వేడుకలను ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఖానాపూర్ మండలంలోని పలు గ్రామాల నుండి భారీగా తరలివచ్చిన ముస్లింలు ఉదయం 7:30 నుండి 7:50 వరకు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం జామా మసీద్ ఇమామ్ రఫీ ఖాన్ బక్రీద్ సందేశాన్ని బోధించారు. బక్రీద్‌ను పురస్కరించుకొని చిన్నా పెద్ద తేడా లేకుండా ముస్లిం సోదరులు ఈద్గా వద్దకు తరలివచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు ముగించుకుని బయటకు వచ్చిన ముస్లింలకు మున్సిపల్ చైర్మన్ చిన్నం సత్యం, సహా పలువురు నాయకులు శుభాకాంక్షలు తెలిపారు.

దిలావర్‌పూర్ : మండలంలోని ఆయా గ్రామాల్లోని ముస్లింలు బక్రీద్ పండగను భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. త్యాగానికి గుర్తుగా జరుపుకునే బక్రీద్‌పై ముస్లిం పెద్దలు ఆధ్యాత్మిక ప్రసంగాలు చేశారు. ఈ సందర్భంగా పలువురు హిందువులు బక్రీద్ శుభాకాంక్షలు చెప్పారు.

కుభీర్ : మండల కేంద్రం కుభీర్‌తో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. స్థానిక ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఒకరినొకరు అలింగనం చేసుకుంటూ పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

సారంగాపూర్ : మండల కేంద్రంతో పాటు బీరవెల్లి, స్వర్ణ, జామ్, తాండ్ర, వైకుంఠాపూర్ గ్రామాలతో పాటు తదితర గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు నూతన వస్త్రాలను ధరించి బక్రీద్ పండగను ఘనంగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో ఈద్గాల వద్ద ముస్లిం సోదరులు ప్రార్థనలు చేసి ప్రవచనాలను చదివి వినిపించారు. అనంతరం ముస్లిం సోదరులకు హిందూ సోదరులు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

మహిళా రిమాండ్ ఖైదీ ఆత్మహత్యాయత్నం

ఆదిలాబాద్ రూరల్, జూన్ 17: ప్రియుడి మోజులో పడి ఈనెల 12న నార్నూర్ మండలంలోని నాగల్‌కొండకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు గజేందర్‌ను భార్య విజయలక్ష్మి సుపారీ ఇచ్చి హత్యచేయించిన ఘటన కలకలం రేపిన విషయం తెలిసిందే.. కాగా ఈ హత్య కేసులో ఆదిలాబాద్ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న మహిళా ఖైదీ విజయలక్ష్మి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. భర్తను హత్యచేయించిన కేసులో విజయలక్ష్మిను శనివారం రాత్రి పోలీసులు జిల్లా జైలుకు తరలించారు. కాగా తాను రిమాండ్‌కు ముందు బ్లేడ్ ముక్కలు మింగినట్లు ఆదివారం సాయంత్రం జైలు అధికారులకు విజయలక్ష్మి తెలిపింది. దీంతో కడుపులో నొప్పిగా ఉందనడడంతో జైలు అధికారులు హుటాహుటిన రిమ్స్‌కు తరలించి పరీక్షలు చేయించారు. కానీ ఎటువంటి బ్లేడ్ ముక్కలు లేనట్లు వైద్యులు నిర్ధారించారు. దీంతో ఆమె చికిత్సల అనంతరం తిరిగి సోమవారం జిల్లా జైలుకు తరలించారు. ఈ విషయమై జిల్లా జైలు సూపరింటెండెంట్ అశోక్ కుమార్‌ను వివరణ కోరగా.. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యుల సూచనల మేరకు జైల్లోనూ చికిత్సలందిస్తూ అబ్జర్వేషన్‌లో ఉంచామన్నారు. ప్రాణాపాయం ఏమీ లేదని ఆయన తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఐకేపీ ఉద్యోగి మృతి

ఉట్నూర్, జూన్ 17: మండలంలోని దంతనపల్లి సమీపంలో ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇందిరాక్రాంతి పథకం ఉద్యోగి ఎర్ర రాజలింగం (35) మృతి చెందాడు. బీర్సాయిపేట వైపు నుంచి ఉట్నూర్‌కు ద్విచక్ర వాహనంపై వస్తున్న రాజలింగు వాహనాన్ని దంతనపల్లి వాగు సమీపంలోని వంతెన వద్ద గేదె ఢీకొట్టడంతో కింద పడిపోయిన రాజలింగుకు తీవ్ర గాయాలయ్యాయని ఉట్నూర్ ఆసుపత్రికి తరలించి వైద్యం అందిస్తుండగా మృతి చెందాడని ఎస్సై మనోహర్ తెలిపారు. మృతునికి భార్య గంగామణి, ఇద్దరు పిల్లలు ఉన్నారని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

యువకుడి బలవన్మరణం

ఉట్నూర్, జూన్ 17: మండలంలోని సాకెర(బి)కి చెందిన యువకుడు తుడసం అర్జున్(20) ఆదివారం చెట్టుకు ఉరేసుకొని బలవన్మరణానికి పాల్పడ్డాడని ఉట్నూర్ ఎస్సై మనోహర్ తెలిపారు.ఆయన కథనం ప్రకారం.. డిగ్రీ వరకు చదువుకున్న అర్జున్ తల్లిదండ్రులు తొడసం ఇస్రు, జంగుబాయిలకు వ్యవసాయ పనులలో చేదోడు వాదోడుగా ఉన్నాడన్నారు.ఈ దంపతులకు ముగ్గురు కొడుకులు,ఒక కుమార్తె ఉండగా.. పెద్దకొడుకు అయిన అర్జున్ గత యేడాది వినాయక ఉత్సవాలలో అకస్మాతుగా కింద పడిపోయి అప్పటి నుంచి మతిస్థిమితం కోల్పోయినట్లు ప్రవర్తిస్తున్నాడని తెలిపారు.ఆదివారం ఉదయం పొలం పనులకు వెళ్లిన అర్జున్ మధ్యాహ్నం వరకు తిరిగి రాలేదన్నారు. పంట చేను వైపు వెతికిన ఆచూకీ లభించక పోవడంతో గ్రామానికి చెందిన ఒకరు పంట చేను సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతు కనిపించాడని తెలుపడంతో కుటుంబ సభ్యులు అక్కడికి వెళ్లి చూసి పోలీసులకు సమాచారం అందించారని తెలిపారు. మృతుల తండ్రి ఇసురు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గురుకుల పాఠశాలలో ఉరేకొని ఉద్యోగి మృతి

ఇచ్చోడ, జూన్, 17: భోజనశాలలో రేకుల కింద ఉండే ఇనుప రాడ్‌కు మెడలో ఉండే దస్తీతో ఉరేసుకొని మృతిచెందిన సంఘటన ఇచ్చోడ మండలంలోని గిరిజన గురుకుల బాలుర పాఠశాలలో సోమవారం ఉదయం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమ్ర నాందేవ్(56) అనే వ్యక్తి అదే పాఠశాలలో ప్రభుత్వ ఉద్యోగిగా మల్టీపర్పస్ వర్కర్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మృతుడు గత నాలుగు నెలల నుంచి మద్యం అధికంగా సేవిస్తున్నాడు. సోమవారం ఉదయం 5గంటల ప్రాంతంలో డైనింగ్ హాల్‌లో ఎవరూ లేకపోవడంతో ఉరివేసుకొని అక్కడికక్కడే మృతిచెందాడు. మద్యానికి బానిసవ్వడం వల్లె క్షణికావేశంలో జీవితంపై విరక్తి చెంది మృతిచెందినట్లు మృతుడి బార్య కుమ్ర చంద్రకళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నరేష్ పేర్కొన్నారు.



విజేతలకు బహుమతులను అందజేస్తున్న బోథ్ ఎమ్మెల్యే అనిల్

'క్రీడల్లో గెలుపోటములు సహజం'

నేరడిగొండ, జూన్ 17: క్రీడల్లో గెలుపోటములు సహజసమని బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ అన్నారు. మండల కేంద్రంలో గత నెల రోజుల నుంచి జరుగుతునర్న ఎన్‌పీఎల్ నేరడిగొండ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు సోమవారంతో ముగియగా ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే అనిల్‌జాదవ్.. ముందుగా ఆటలో విన్నర్‌గా నిలిచిన సైనిక్ సిక్సర్ జట్టు, రన్నర్‌గా నిలిచిన రైసింగ్‌రైడర్ జట్లకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడాకారులు అంత ఐక్యమత్యంతో ఉండి క్రీడా స్ఫూర్తిని చాటడం సంతోషం అని అన్నారు. అదేవిధంగా గత ఐదు సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తు వస్తున్న ఎన్‌పీఎల్ నిర్వాహకులకు అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాథోడ్‌సజన్, ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, వీడీసీ చైర్మన్ రవీందర్ రెడ్డి, సురేందర్‌రాథోడ్, ముండే పాండురంగ్, జాదవ్‌దాస్‌రాజ్, సాయిరాం, నర్వడే రమేష్. ఎన్‌పీఎల్ బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమంలో ఆడే గజేందర్, తెలంగాణ రాష్ట్ర అధ్యాపకుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జాదవ్ బలిరామ్, తదితరులు పాల్గొన్నారు.

● ఉత్తమ ర్యాంకు సాధించిన యువకుడికి సన్మానం

నేరడిగొండ: జేఈఈ అడ్వాన్స్ ఫలితాల్లో జాతీయ స్థాయిలో 210 ర్యాంకు సాధించిన గిరిజన యువకుడు భుక్యా విజయరాజ్‌ను సోమవారం ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ సన్మానించారు. గిరిజన యువకుడు విజయరాజ్ జాతీయ స్థాయిలో 210 ర్యాంకు సాధించి తల్లిదండ్రులతో పాటు ఉపాధ్యాయుల నమ్మకాన్ని వమ్ము చేయలేదన్నాడు. రాబోయే రోజుల్లో గిరిజన యువకులు విద్య ఉద్యోగాల్లో రాణించాలన్నారు. ఆయన వెంట వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, పాండురంగ్, ధన్‌రాజ్, సురేందర్, సాయిరాం, రమేష్, రాజునాయక్, తదితరులు పాల్గొన్నారు.



ఇచ్చోడలో ఎండ వేడితో నిర్మానుష్యంగా మారిన రోడ్డు

మృగశిర కార్తె వచ్చినా.. తగ్గని ఎండలు

● ఆకాశం వైపు అన్నదాతల చూపు!!

ఇచ్చోడ, జూన్, 17: వర్షాకాలం రోజులు, మృగశిర కార్తె ప్రారంభమై 10 రోజులు కావస్తున్నా.. ఇంకా ఎండల తీవ్రత, వేడిగాలుల ప్రభావం తగ్గలేదు. నిత్యం 37, 38, 39, 40 సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఉదయం 6గంటల నుంచే ఎండల ప్రభావంతో వాతావరణం, పరిసరాలు వేడెకుతున్నాయి. ఇచ్చోడ పట్టణంలో ఎండవేడికి తాళలేక జన సంచారం తగ్గుతోంది. సోమవారం మండలంలో 38 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదైంది. వర్షాకాలం ప్రవేశించి పదిరోజులవుతున్నా వరుణుడు కరుణించకపోవడతో అన్నదాతలు ఆకాశం వైపు చూస్తున్నారు. ఇప్పటికే చెరవుల్లో నీరు ఎండి బీటలు వారాయి.



చిన్నపాటి వర్షానికే కొట్టుకుపోయిన కుచలాపూర్-ధన్నూర్ రోడ్డు

తొలి వర్షానికే కొట్టుకుపోయిన రోడ్డు

బోథ్, జూన్ 17: మండలంలోని దన్నూర్ మీదుగా ఆడెల్లి వరకు వేసిన రోడ్డు ఏడాదైనా పూర్తి కాక ముందే చిన్న చిన్న వర్షాలకి కొట్టుకుపోయింది. ఆదివారం రాత్రి కురిసిన వర్షానికి చిన్న వరద రావడంతో రోడ్డు పక్కన కోతకు గురైంది. దీంతో కోట్ల రూపాయల నిధులతో చేపట్టిన రోడ్డు భారీ వర్షాలకు కొట్టుకుపోయిందని ఈ ప్రాంత వాసులు ఆందోళన వ్యక్తపరుస్తున్నారు. ఆదివారం కురిసిన వర్షంతో రోడ్డు పక్కన ఉన్న మొరం కొట్టుకుపోవడంతో పాటు రోడ్డు కింద సైతం బుంగ పడ్డదని స్థానికులు పేర్కొంటున్నారు. అంతేకాకుండా భారీ వాహనాలు పోతే రోడ్డు కుంగిపోక తప్పదని స్థానికులు అంటున్నారు. ఎన్నో సంవత్సరాల కాలంలో రోడ్లతో ఇబ్బందులు పడుతుంటే వేసిన రోడ్డు నాసిరకంగా ఉండటం ఈ ప్రాంత వాసులకు శాపంగా మారిందని వాపోతున్నారు. అధికారులు తక్షణమే మరమ్మతులు చేపట్టాల్సిన అవసరం ఉంది.



వాహనాలను తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారి, పోలీసులు

అనుమతి లేకుండా పశువులను తరలిస్తే కఠిన చర్యలు : పశువైద్యాధికారి

● లక్ష్మంపూర్ అంతర్‌రాష్ట్ర చెక్‌పోస్టు వద్ద వాహనాల తనిఖీ

తలమడుగు, జూన్ 17: ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా పశువులను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని మండల పశువైద్యాధికారి డాక్టర్ దూద్ రామ్ రాథోడ్ అన్నారు. సోమవారం మండలంలోని అంతరాష్ట్ర లక్ష్మంపూర్ చెక్‌పోస్టు వద్ద ముమ్మరంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మండల పశువైద్యాధికారి దూద్‌రామ్ రాథోడ్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అనుమతి లేకుండా ఎలాంటి పశువులను కూడా అక్రమంగా తరలించవద్దన్నారు. గోవధ చట్టరీత్యా నేరమని ఆయన పేర్కొన్నారు. ఎవరైనా పశువులను అక్రమంగా తరలిస్తే సమాచారం అందించాలని సూచించారు. అనంతరం పలు వాహనలను తనిఖీ చేశారు. ఈ తనిఖీలో పశువైద్య సిబ్బంది సౌమ్య, పోలీసు సిబ్బంది, చెక్‌పోస్టు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

వాడవాడలా బక్రీద్ వేడుకలు

● ఆదిలాబాద్ జిల్లాలోని గ్రామాల్లో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు ● ఎస్పీని కలిసి శుభాకాంక్షలు తెలిపిన బోథ్ కాంగ్రెస్ నాయకులు

ఇచ్చోడ, జూన్, 17: మండలవ్యాప్తంగా సోమవారం ముస్లింల త్యాగాలకు ప్రతీకగా నిలిచే బక్రీద్ పర్వదిన వేడుకలను అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఉదయం ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలు జరుపుకున్నారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ అంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

నేరడిగొండ: మండలంలో బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయమే ఈద్గాల వద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. బోథ్ ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ముస్లిం సోదరులకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బోథ్ ఇన్‌చార్జీ ఆడే గజేందర్ సైతం ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో ఎంపీపీ రాథోడ్ సజన్, వీడీసీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, డా.జహీర్, సురేందర్, తదితరులున్నారు.

జైనథ్: మండలంలోని దీపాయిగూడ, లేఖర్‌వాడ, గిమ్మా, నిరాల, బోరజ్, సిర్సన్న, గూడ తదితర గ్రామాలతో పాటు మండల కేంద్రమైనర జైనథ్‌లో సోమవారం బక్రీద్ పండుగ పర్వదినాన్ని ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా మసీదులు, ఈద్గాల వద్ద సామూహిక ప్రార్థనలను నిర్వహించారు. మండల కేంద్రమైన జైనథ్ లో గ్రామ పెద్దలు బద్దంసురేష్‌రెడ్డి, ఎస్.వెంకన్నయాదవ్, అల్లూరి అశోక్‌రెడ్డి, అడ్డిరుకేష్‌రెడ్డి, బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు.

సిరికొండ: మండలంలో ఈద్-అల్-అదా(బక్రీద్) పండుగ వేడుకలను సోమవారం ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. అల్లాపై ఉన్న విశ్వాసాన్ని చాటుతూ..త్యాగాలకు మారుపేరుగా ఈ పర్వదినాన ఉదయాన్నే ముస్లింలు ఈద్గాల వద్దకు చేరుకుని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

తలమడుగు: మండలంలోని ఆయా గ్రామాల్లో ముస్లీం సోదరులు భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఉదయం నుంచి ముస్లింలు ఈద్గా వద్దకు వెళ్లి ప్రార్థనలు నిర్వహించారు. అలాగే దేవపురం మాజీ సర్పంచ్ అబ్దుల్లాకు ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్, పండుగ శుభాకాంక్షలు తెలియజేసి ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలని సూచించారు.

గుడిహత్నూర్: బక్రీద్ పండుగను సోమవారం గుడిహత్నూర్ మండలకేంద్రంతో పాటు తోషం, సీతాగొంది, మన్నూర్, శాంతాపూర్, సూర్యగూడ, డోంగ్రాగావ్, లింగాపూర్ గ్రామాల్లో ముస్లీంలు భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. సమీపంలో ఉన్న ఈద్గాల వద్దకు వెళ్లి సామూహిక ప్రార్థనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.



నేరడిగొండలో శుభాకాంక్షలు తెలుపుతున్న ఎమ్మెల్యే అనిల్

భీంపూర్: మండలంలోని పిప్పల్‌కోటి, నిపాని, గోన, వాడూర్, అర్లి (టి), అంతర్‌గావ్ గ్రామాలలో బక్రీద్ పండుగ పర్వదినాన్ని ముస్లిం సోదరులు ఘనంగా జరుపుకున్నారు. ఈద్గా, మసీదులలో నమాజ్‌లు చేశారు. ఎంపీపీ కుడిమేత రత్నప్రభ సంతోష్, జడ్పీటీసీ కుంరా సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్నలు వారిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు. భీంపూర్ పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

ఇంద్రవెల్లి: భక్తి విశ్వాసాలు, త్యాగానికి ప్రతీకగా జరుపుకునే బక్రీద్ పండుగను సోమవారం ముస్లింలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లోని ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. ఇందులో కోఆప్షన్ సభ్యులు మిర్జా జిలాని బేగ్, మిర్జా యాకూబ్ బేగ్, ఏఎస్సై కాత్లే భీంరావు, తదితరులున్నారు.

బోథ్: బోథ్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి ఆడే గజేందర్ సోమవారం జిల్లా ఎస్పీ గౌస్ ఆలంను కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీకి పుష్పగుచ్చం అందించి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆయన వెంట ఆ పార్టీ నాయకులు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ యూత్ అధ్యక్షులు బద్దం పోతారెడ్డి ఉన్నారు.



తోషంలో ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు



పిప్పల్‌కోటి ఈద్గాలో ప్రవచనాలు ఇస్తున్న హాఫీజ్ రంజాని



కేస్లాగూడలోని ఈద్గా వద్ద ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు



జైనథ్‌లో బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్న గ్రామపెద్దలు



సిరికొండలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తున్న ముస్లిం సోదరులు



దేవాపూర్‌లో పాల్గొన్న ఆదిలాబాద్ మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్



ఎంపీ నగేష్‌ను సన్మానిస్తున్న గ్రామస్థులు

కేంద్రం నిధులతో పంచాయతీల అభివృద్ధి

● ఆదిలాబాద్ ఎంపీ గోడం నగేష్

తలమడుగు, జూన్ 17: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నాయకులు విచ్చలవిడిగా మద్యం, డబ్బులు పంపిణీ చేసిన ప్రజలు మాత్రం వాటికి లొంగకుండా బీజేపీని ఆదరించి గెలిపించారని ఎంపీ నగేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో ఎంపీ నగేష్‌కు ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు, కార్యకర్తలు ఎంపీని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షులు పతంగి బ్రహ్మానందం, మండల కన్వీనర్ బోనగిరి స్వామి, బీజేపీ జిల్లా నాయకులు కనపర్తి చంద్రకాంత్, మాజీ జడ్పీటీసీ ప్రభాకర్, జడ్పీటీసీల ఫోరం జిల్లా కన్వీనర్ తాటిపల్లి రాజు, మాజీ సర్పంచ్ మహేందర్ యాదవ్, కాంతారావు, నారాయణరెడ్డి, పొట్టిపెల్లి శ్రీనివాస్, పాండు, ప్రేమేందర్‌రెడ్డి, వేణు,బీఆర్ఎస్ పార్టీ నాయకులు కాటిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ దేవన్న, వినోద్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మల్ జిల్లాలో ఘనంగా బక్రీద్ వేడుకలు



సంబరాల్లో చిన్నారులు



శుభాకాంక్షలు తెలుపుతున్న దృశ్యం



భైంసాలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

నిర్మల్ కల్చరల్, జూన్ 17 : నిర్మల్ జిల్లాలో ముస్లిం సోదరులు సోమవారం బక్రీద్ పండగ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మసీదులకు వెళ్లి ప్రార్థనలు జరిపారు. ఒకరికొకరు ఈద్ ముబారక్ చెప్పుకున్నారు. అలై బలైతో ఆత్మీయత పంచుకున్నారు. చిన్నా పెద్ద కలిసి కుటుంబ సభ్యులతో పండగను ఆనందంగా గడిపారు. పలువురు ఈ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. పోలీసులు ఈ సందర్భంగా గట్టి బందోబస్తు చర్యలు తీసుకున్నారు. మున్సిపల్ అధికారులు అన్ని సౌకర్యాలను పర్యవేక్షించారు.

భైంసా : పట్టణంలో ముస్లీంలు సోమవారం బక్రీద్ పర్వదినాన్ని భక్తి ప్రవత్తులతో ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని ముస్లింలు స్థానిక గడ్డెన్నవాగు ప్రాజెక్టు సమీపంలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కొంత మంది స్థానిక మసీదులలో ప్రార్థనలు చేపట్టారు. అనంతరం ఖలీలుల్లా త్యాగనిరతికి గుర్తుగా పవిత్ర ఖుర్బానీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఒకరికొకరు పర్వదిన శుభాకాంక్షలు తెలుపుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. ఉదయం 9 గంటలకు ప్రారంభమైన ప్రత్యేక ప్రార్థనలు 10 గంటలకు ముగిసాయి. పర్వదినాన్ని పురస్కరించుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేందుకు గాను పోలీసు శాఖ కట్టుదిట్టమైన భద్రతాచర్యలు చేపట్టింది. భైంసా ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్ నేతృత్వంలో టౌన్ సీఐ రాజారెడ్డి ఆధ్వర్యంలో డివిజన్ పరిధిలోని పోలీసులు బందోబస్తు విధుల్లో పాల్గొన్నారు.

ముథోల్ : మండ ల కేంద్రమైన ముథోల్‌తో పాటు మండలంలోని తరోడా, ఆష్ట, ఎడ్‌బిడ్, మచ్కల్ తదితర గ్రామాల్లో సోమవారం బక్రీద్ పండగను ముస్లిం సోదరులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం కొత్త బట్టలు ధరించి మసీదులు, ఈద్గాలలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఒకరికొకరు పండగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఈ సందర్భంగా ముథోల్ సీఐ మల్లేష్ నేతృత్వంలో ఎస్సై సాయికిరణ్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

తానూర్ : మండల కేంద్రమైన తానూర్‌తో పాటు మండలంలోని కోలూర్, మొగిలి, మసల్గా, జౌల (బి) , దహాగాం, నందిగాం, ఉమ్రి (కె), బెంబర్, బోల్సా, ఝరి (బి), భోసి తదితర గ్రామాల్లో సోమవారం ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లోని ఈద్గా, మసీదులతో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఒకరినొకరు అలింగనం చేసుకొని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. దీంతో ఎక్కడ చూసినా పండగ శోభ అగుపడింది.

రెంటల్ చెల్లించకుండా వచ్చిన


ఇసుక లారీని చేజేతులా జార విడిచారు

● తప్పు మాది కాదంటే మాది కాదంటున్న మైనింగ్ పోలీసు అధికారులు



ఆదివారం రాత్రి రెంటల్‌కట్టకుండా ఇసుకతో వచ్చిన లారీ ఇదే..

బోథ్, జూన్ 17 : బోథ్ మండల కేంద్రం సమీపంలో నూతనంగా నిర్మిస్తున్న చెక్‌డ్యామ్ నిర్మాణం కోసం నిర్మల్ ప్రాంతానికి చెందిన ఓ లారీ యజమాని జీరోగా ఎలాంటి రెంటల్ కట్టకుండానే ఇసుక లారీని తీసుకువచ్చాడు. రెంటల్ కట్టకుండా 60 టన్నులతో వచ్చిన లారీ విషయం తెలుసుకున్న కొంత మంది స్థానికులు లారీని అడ్డుకున్నారు. అంతేగాక ఎలాంటి రెంటల్ కట్టకుండా ఇసుకకు సంబంధించిన పత్రాలు లేకుండా ఇసుకను తీసుకువచ్చిన లారీ విషయమై మైనింగ్ అధికారులకు స్థానిక పోలీసు అధికారులకు రెవెన్యూ అధికారులకు స్థానికులు సమాచారం అందించారు. అయితే ఆదివారం సెలవు రోజు కావడంతో తహసీల్దార్ లారీ విషయమై పోలీసులకు సమాచారం ఇస్తామని వారు లారీని స్వాధీనం చేసుకుంటారన్నారు. ఇక స్థానిక ఎస్సైకి ఫిర్యాదు చేయగా ముందుగా ఇద్దరు పోలీసులను పంపించి లారీ వద్ద ఉండాలని చెప్పి మరో 115 నిమిషాల తరువాత ఎస్సై అక్కడికి చేరుకున్నారు. అంతకు ముందే మైనింగ్ అధికారులు ఆదిలాబాద్ నుంచి కారులో వచ్చి ఇసుకతో వచ్చిన లారీని పరిశీలించి పోలీసు స్టేషన్‌కు తరలించేందుకు ప్రయత్నించారు. అయితే అప్పటికే లారీని తీసుకువచ్చిన డ్రైవర్ అక్కడి నుంచి పారిపోయారు. లారీ దగ్గరకు చేరుకుని ఎస్ఐ మైనింగ్ అధికారులతో చర్చించారు. లారీని పోలీసు స్టేషన్‌కు తీసుకువెళదామని మాట్లాడారు. ఆ తరువాత స్థానికంగా ఉన్న లారీ యజమానులతో ఇసుక లారీని తీసుకువెళ్లేందుకు ప్రయత్నించగా లారీ స్టార్ట్ కాలేదు. దీంతో మైనింగ్ అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోవటం జరిగింది. స్థానిక పోలీసులు సైతం లారీని విడిచి పెట్టి వెళ్లిపోయారు. ఖాళీ అయిన ఇసుకను అక్కడే ఉంచి పట్టుబడిన లారీని సోమవారం మూడు గంటల ప్రాంతంలో అక్కడి నుంచి సదరు లారీ యజమాని తీసుకువెళ్లినట్లు సమాచారం. ఏది ఏమైనా దొంగ చాటుగా వచ్చిన ఇసుక లారీని ఇరు శాఖల అధికారులు కళ్ల ముందే కనిపించిన లారీ చేజార్చడం చర్చనీయాంశంగా మారింది. మైనింగ్ అధికారులు లారీని పోలీసులు స్వాధీనం చేసుకుంటారని పేర్కొంటుండగా పోలీసులు మాత్రం మైనింగ్ అధికారులు మాకు అప్పజెప్పలేదని పేర్కొంటున్నారు. ఏది ఏమైనా లారీ అక్కడి నుంచి తీసుకువెళ్లడం వెనుక ఎవరి హస్తం ఉందనే విషయం జిల్లాస్థాయి అధికారులు విచారణ జరిపితే తెలిసిపోతుందని పరిశీలకులు అంటున్నారు. మరో వైపు ఖాళీ చేసిన ఇసుకను రెవెన్యూ అధికారులు స్వాధీనం చేసుకోవాలని పలువురు పేర్కొంటున్నారు.





ఆంజనేయస్వామి విగ్రహానికి జలాభిషేకం చేస్తున్న చిన్నారులు

వర్షాలు కురవాలని బోగ్‌బండార్



బోగ్‌బండార్ నృత్యాలు చేస్తున్న మహిళలు

నేరడిగొండ, జూన్ 17: వర్షాలు సమృద్ధిగా కురవాలని కోరుతూ మండలంలోని సావర్గం గ్రామంలో సోమవారం గ్రామస్థులు బోగ్‌బండార్ కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా స్థానిక ఆంజనేయ స్వామి ఆలయంలో గల విగ్రహానికి చిన్నారులు, గ్రామస్థులు జలాభిషేకం చేశారు. అంతేకాకుండా పెళ్లికాని యువతులు ఆలయం వద్ద సంప్రదాయ పాటలు పాడుతూ బోగ్‌బంగార్ కార్యక్రమంలో భాగంగా నృత్యాలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

జాడలేని.. వాన

మొలకెత్తుతున్న పత్తి విత్తనాలు





- జిల్లాలో వర్షాకాలం ప్రారంభమై పక్షం రోజులైనా.. ఆశించిన స్థాయిలో కురవని వర్షాలు
- ఇప్పటి వరకు కురిసింది 47.0 మి.మీ. వర్షపాతం మాత్రమే..
- తొలకరికే విత్తనాలు వేసిన రైతులు
- సిరికొండ మండలంలో సాధారణం.. గుడిహత్నూర్‌లో అధిక వర్షపాతం
- పలుచోట్ల మండుతున్న ఎండలకు వాడుతున్న మొలకలు
- పంటలను కాపాడుకునేందుకు అన్నదాతల ఆరాటం
- జిల్లావ్యాప్తంగా 39-40 డిగ్రీల వరకు నమోదవుతున్న పగటి ఉష్ణోగ్రతలు



ఆదిలాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): వానాకాలం సీజన్ ప్రారంభమై పక్షం రోజులు గడిచిపోయిన ఆశించిన స్థాయిలో వర్షపాతం నమోదు కావడం లేదు. తొలకరి వర్షాలకే తొందరపడి విత్తనాలు వేసుకున్న రైతులు దిక్కులు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఈయేడు ఎన్నో ఆశలతో వానకాల పంటల సాగుకు సిద్ధమైన రైతులు వర్షపు చినుకుల కోసం ఎదురు చూడక తప్పడం లేదు. అతి ధీమాతో విత్తనాలు వేసిన రైతుల్లో తొందరపడ్డామా అనే భావన కనిపిస్తుంది. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా లక్ష ఎకరాలకు పైగా వివిధ రకాల పంటలు సాగైనట్లు వ్యవసాయ శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ప్రధానంగా పత్తి, సోయా, కంది, చిరుధాన్యాల పంటలు, వర్షాధార మెట్ట పంటలనే అధికంగా సాగు చేస్తుంటారు. రాష్ట్రంలోనే అత్యధికంగా వర్షపాతం నమోదయ్యే జిల్లాలో ఇప్పటి వరకు 47.0 మి.మీ.ల వర్షపాతం మాత్రమే నమోదైంది. జూన్ మాసంలో 202.9 మి.మీల వర్షం కురవాల్సి ఉంది. దీంతో -46.0 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైంది. ఇన్నాళ్ల పత్తి విత్తనాలు దొరుకక అల్లాడిన రైతులు వర్షపు జాడ లేక పోవడంతో కంటి మీద కునుకు లేకుండానే పోతుందని వాపోతున్నారు. అక్కడక్కడ బోరుబావులు ఉన్న ఆశించిన స్థాయిలో భూగర్భ జలాలు లేక పోవడంతో ఏమి చేయలేని పరిస్థితి ఎదురవుతుందని చెబుతున్నారు. ప్రస్తుతం జిల్లాలో 40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదు కావడం వేసవి పరిస్థితులను తలపిస్తున్నాయి. ఇప్పటికే విత్తనాలు వేసి వారం రోజులు గడుస్తున్నా.. సరిపడా వర్షాలు లేక పోవడంతో మొలకలను కాపాడుకునేందుకు అన్నదాతలు పడరాని పాట్లు పడుతున్నారు.

తగ్గిన మొలక శాతం

వర్షాలు లేక నేలలో తేమశాతం పూర్తిగా తగ్గిపోయి మొలక శాతం కూడా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. దీంతో మళ్లీ విత్తనాలు వేసుకునే పరిస్థితి ఏర్పడుతుందంటున్నారు. జిల్లాలో అధికంగా నల్లరేగడి నేలలే అందుబాటులో ఉన్నాయి. సహజంగానే నల్లరేగడి నేలల్లో తేమ శాతం అధికంగానే ఉంటుంది. ఈ నేలల్లో పంటల పరిస్థితి కొంతమెరుగ్గానే ఉన్నప్పటికీ.. ఎర్ర నేలల్లో మొలకెత్తిన పత్తి మొలకలు వాడుముఖం పడుతున్నాయి. విత్తనం వేసినప్పటి నుంచి వర్షపు చినుకుల జాడలేక పోవడంతో అన్నదాతలు ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే వేసిన 50 శాతం పంటలో కేవలం 10-15 శాతం వరకు విత్తనాలు మాత్రమే మొలకెత్తాయి. మిగితా విత్తనాలు నేలపాలయ్యే అవకాశం ఉందని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోరుబావులు అందుబాటులో ఉన్న రైతులు డ్రిప్స్ స్పింక్లర్స్ ద్వారా పత్తి మొలకలకు నీటి తడులను అందించే ప్రయత్నం చేస్తున్నారు. కొందరైతే వర్షం కురిసేంత వరకు మొలిచిన మొకలను కాపాడుకునేందుకు నీటిని చల్లుతూ పంటలను కాపాడుకుంటున్నారు. మరో నాలుగైదు రోజుల పాటు ఇదే పరిస్థితి ఉంటే పూర్తిగా నష్టపోయే ప్రమాదం ఉంద ని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

లోటు వర్షపాతం

జూన్ 1నుంచి జూన్ 17వరకు జిల్లావ్యాప్తంగా 86.8 మి.మీ.ల వర్షపాతం కురవాల్సి ఉండగా.. కేవలం 47.0 మి.మీ.ల వర్షపాతం మాత్రమే కురిసింది. దీంతో -46.0 మి.మీ.ల లోటు వర్షపాతం నమోదైంది. జిల్లాలోని మొత్తం 18 మండలాలు ఉండగా.. సిరికొండ మండలంలో సాధారణం, గుడిహత్నూర్ మండలంలో అధిక వర్షపాతం నమోదైంది. ఉట్నూర్, నేరడిగొండ, ఇచ్చోడ, మావల, ఇంద్రవెల్లి, గాదిగూడ, భీంపూర్ మండలాల్లో అధికలోటు వర్షపాతం కనిపిస్తుంది. మిగితా మండలాల్లోనూ లోటు వర్షపాతం నమోదైంది. సోమవారం 7.7 మి.మీ.ల వర్షపాతం నమోదు కావాల్సి ఉండగా.. కేవలం 6.6 మి.మీ.ల వర్షం కురిసింది. దాదాపుగా అన్ని మండలాల్లో 10 మి.మీ.ల లోపే వర్షం కురిసింది. అత్యధికంగా నేరడిగొండ మండలంలో - 87.0 మి.మీ.ల లోటు వర్షపాతం కనిపిస్తోంది. సాగునీరు అందుబాటులో లేని రైతులు దేవుడిపైనే భారం వేస్తూ.. ఆకాశం వైపు ఎదురు చూస్తున్నారు. అంతేకాకుండా జిల్లాలోని ఆయా గ్రామాలలో వర్షం కోసం గ్రామ దేవతలకు ప్రత్యేక పూజలు, కప్పతల్లి ఆటలు ఆడుతూ వరుణుడి కరుణ కోసం ఆకాశంవైపు ఎదురు చూస్తున్నారు.

ఇంకా వేసవి పరిస్థితులే..

వర్షాకాలం మొదలై పక్షం రోజులు గడిచి పోతున్నా.. ఇంకా జిల్లాలో వేసవి పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇప్పటికి 39-40 డిగ్రీల వరకు పగటి ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. సోమవారం జిల్లా గరిష్ఠ ఉష్ణోగ్రత 39.8 డిగ్రీలు కాగా.. కనిష్ఠంగా 25.2 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 35 డిగ్రీల లోపు ఉష్ణోగ్రతలు ఉంటేనే విత్తనాలను విత్తుకోవాలి. కానీ 40 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదవుతున్న విత్తనాలు వేసి మొలకల కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. ఇప్పటి వరకు జిల్లాలో ఎక్కడా భారీ వర్షం కురవక పోవడంతో నేలలో తేమ కనిపించడం లేదు. నీటి తడులను అందిస్తున్నా.. ఆశించిన స్థాయిలో మొలక శాతం రావడం లేదని రైతులు చెబుతున్నారు. వర్షాధారంగా పంటలను సాగు చేసిన రైతులు మండిపోతున్న ఎండలకు ఆందోళనకు గురవుతున్నారు. వేల రూపాయలు పెట్టి ఖరీదైన విత్తనాలను కొనుగోలు చేసిన రైతులు ఆదరబాదరగా విత్తుకోవడంతో ఆపదలు తప్పేలా లేవంటున్నారు.

వర్షాలు కురవకపోతే.. ఎంతగానో నష్టపోతాం

: కారే ఊశన్న, రైతు, తలమడుగు మండలం



వర్షాలు కురుస్తాయని నమ్మకంతో విత్తనాలు వేశాం. కానీ, ప్రస్తుతం కురుస్తున్న తేలికపాటి వర్షాలతో ఏం ప్రయోజనం లేకుండా పోతోంది. సరైన వర్షపాతం లేకపోవడంతో విత్తనాలు మొలకెత్తడం లేదు. కొన్నిచోట్ల వేసిన విత్తనం నేలపాలవుతోంది. మరో నాలుగైదు రోజుల పాటు ఇవే పరిస్థితులు ఉంటే భారీగా నష్టపోవాల్సి వస్తుంది. నీటి తడులను అందిందామన్నా.. బోరుబావుల్లో నీళ్ల కనిపించడం లేదు. ఇక దేవుడి పైనే భారం వేసి ఆకాశం వైపు వర్షాల కోసం గంపెడు ఆశలతో ఎదురు చూస్తున్నాం.

సంక్షిప్త సమాచారం



మాజీ మంత్రిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే పాయల

తలసానికి ఎమ్మెల్యే పరామర్శ

ఆదిలాబాద్ అర్బన్, జూన్ 17: మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ సోదరుడు మోండా మార్కెట్ వర్తకుల సంఘం అధ్యక్షుడు తలసాని శంకర్ యాదవ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్, బీజేపీ నాయకులు ముస్తాపూర్ అశోక్ వారి కుటుంబ సభ్యులను సోమవారం పరామర్శించారు. ముందుగా తలసాని శంకర్ యాదవ్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. ఆయన వెంట బీజేపీ నేతలు, తదితరులు న్నారు.

'అందుబాటులో సోయా విత్తనాలు'

జైనథ్, జూన్ 17: మండల కేంద్రమైన జైనథ్ సహకార సంఘంలో మండల రైతులకు సరిపడ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని జైనథ్ సీఈవో గంగన్న సోమవరం ఒక ప్రకటనలో తెలిపారు. జెస్ 335 అనే రకం సోయా బస్త 30కిలోలకు రూ.2100కు విక్రయించబడుతుందన్నారు. ఈ అవకాశాన్ని జైనథ్ మండలంలోని ఆయా గ్రామాలలో గల సోయా రైతులు సద్వినియోగం చేసుకోవాలని సీఈవో కోరారు.

'19న చలో హైదరాబాద్'

తలమడుగు, జూన్ 17: ఈనెల 19న ఆర్‌ఎంపీ పీఎంపీ ఆధ్వర్యంలో చేపట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ అసోసియేషన్ మండల అధ్యక్షుడు అశోక్ సింగ్ కోరారు. సోమవారం మండలంలోని సుంకిడి గ్రామంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు సేవలు చేస్తున్న ఆర్‌ఎంపీ, పీఎంపీలపై రోజురోజుకు దాడులు జరుగుతున్నాయని అన్నారు. గ్రామీణ ప్రజలకు సేవ చేస్తూ కడుపునింపుకుంటున్న ఆర్‌ఎంపీలపై కక్ష సాధింపు చర్యలు చేపడుతున్నారని అన్నారు. ఆర్‌ఎంపీలపై జరుగుతున్న దాడులను ప్రభుత్వం అరికట్టి ప్రతీ ఒక్కరికి ప్రభుత్వపరంగా శిక్షణ అందించి వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. అదే విధంగా ఈనెల 19న హైదరాబాద్‌లో చేపడుతున్న పాదయాత్రలో ఉమ్మడి జిల్లా నుంచి అధిక సంఖ్యలో ఆర్‌ఎంపీ పీఎంపీలు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.

ఎస్పీని కలిసిన సబ్ డివిజన్ పోలీసులు

ఆదిలాబాద్ రూరల్, జూన్ 17: లోక్‌సభ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు చోటు లేకుండా శాంతియుతంగా జరిగేలా చర్యలు తీసుకున్నందుకు కేంద్ర ఎన్నికల సంఘం ద్వారా ప్రశంసా పత్రం పొందిన ఎస్పీ గౌస్‌ఆలంకు ఆదిలాబాద్ సబ్ డివిజన్ పోలీసులు సోమవారం సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్పీ క్యాంపు కార్యాలయంలో జిల్లా ఎస్పీని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛం శుభాకాంక్షలు తెలిపారు. ఇందులో డీఎస్పీ జీవన్ రెడ్డి, సీఐలు సత్యనారాయణ, అశోక్, ఫణీందర్, సాయినాథ్, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో బక్రీద్ పర్వదినం

- జిల్లాలో ఈద్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేసిన మైనార్టీ సోదరులు
- శుభాకాంక్షలు తెలిపిన ఎస్పీ, పలువురు ప్రజాప్రతినిధులు



ఆదిలాబాద్‌లో ఈద్గా మైదానంలో ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లిం సోదరులు(ఇన్‌సెట్‌లో ముస్లిం మత పెద్ద)





ఆదిలాబాద్ అర్బన్, జూన్ 17: ముస్లింలు జరుపుకునే రెండో అతి పెద్ద పండుగ బక్రీద్ పర్వదినాన్ని సోమవారం జిల్లా అంతటా ఘనంగా జరుపుకున్నారు. త్యాగానికి ప్రతికగా ముస్లింలు ఈ పండుగను జరుపుకోవడం ఆనవాయితీ. ఉదయం పూట కొత్త దుస్తులు ధరించి సమీపంలోని ఈద్గాలకు వెళ్లి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం పేదలకు, బంధువులకు కుర్బాని పంపిణీ చేశారు. కాగా సోమవారం ఉదయం పట్టణంలోని ఈద్గా మైదానంలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముస్లిం మతపెద్దలు పండుగ ప్రాముఖ్యతను తెలిపారు. అనంతరం ఒకరినొకరు ఆలింగనం చేసుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకు న్నారు. ఇదిలా ఉంటే కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, ఆదిలాబాద్ జిల్లా ఎస్పీ గౌస్‌ఆలంతో పాటు పలువురు ప్రముఖులు ఈద్గా వద్ద ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. అటు బక్రీద్ పండుగ సందర్భంగా కుటుంబ సమేతంగా జిల్లా ఎస్పీ గౌస్‌ఆలం ఈద్గా మైదానంలో పాల్గొని పవిత్ర పార్థనలు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఖుర్బాని జరిపే సమయంలో పరిసరాల పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని, ఎవరికి ఇబ్బందులు కలుగకుండా చూసుకోవాలని ఎస్పీ సూచించారు. బక్రీద్ పండుగకు పటిష్ట బందోబస్తును ఏర్పాటు చేశామని తెలిపారు.

ఉట్నూర్: హజ్రత్ ఇబ్రహీం త్యాగానికి ప్రతీకగా నిలిచిన బక్రీద్ పండుగను ఉట్నూర్ ఏజెన్సీలోని ప్రజలు సోమవారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఉట్నూర్ మండల కేంద్రంలోని దర్గా సమీపంలో ఉన్న ఈద్గావద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా మౌలాన మాట్లాడుతూ దేశంలో శాంతి సౌభ్రాతృత్వం నెలకొనడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. అంతేత్యాగానికి త్యాగానికి చిహ్నంగా నిలిచిన బక్రీద్ పండుగ సందర్భంగా ప్రతీ ఒక్కరు సుఖసంతోషాలతో ఉండాలని వారు పేర్కొన్నారు. ఉట్నూర్ మండలంలోని హస్నాపూర్, దంతన్‌పల్లి, బీర్సాయిపేట, ఎంకా, షాంపూర్, లింగోజీతండాలతో పాటు నార్నూర్, గాదిగూడ మండలాల్లోని ఆయా గ్రామాల్లో సైతం బక్రీద్ పండుగను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా పలు రాజకీయ పార్టీల ప్రతినిధులు ముస్లింలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.



నమాజు చేస్తున్న చిన్నారులు



ఎస్పీకి పండుగ శుభాకాంక్షలు తెలుపుతున్న ముస్లిం సోదరులు



ఉట్నూర్ ఈద్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న దృశ్యం

ఆయిల్‌పామ్ అడ్వైజర్ కమిటీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఎమ్మెల్యే బొజ్జు

ఉట్నూర్, జూన్ 17: తెలంగాణ ఆయిల్‌పామ్ అడ్వైజరీ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను ప్రభుత్వం నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సోమవారం మండల కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను ఖానాపూర్ ఉద్యానవన పట్టు పరిశ్రమ శాఖ అధికారి మౌనిక మర్యాదపూర్వకంగా కలిసి నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతులు ఆయిల్‌పామ్ సాగు చేయడం వల్ల అధిక లాభాలు పొందవచ్చని అన్నారు. నెలనెలా ఆదాయానిచ్చే ఏకైక పంట ఆయిల్‌పామ్ అని పేర్కొన్నారు. జిల్లాలోని రైతులకు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పించాలని అధికారులకు సూచించారు. రైతులు ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన పెంచుకొని ఆర్థికంగా ఎదగాలని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతును రాజును చేయడమే లక్ష్యంగా పని చేస్తుందని, ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రీయూనిక్ కంపెనీ ఏరియా మేనేజర్ మనోజ్‌రెడ్డి, క్లస్టర్ ఆఫీసర్ దినేష్, తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే బొజ్జుపటేల్‌కు నియామక పత్రం అందిస్తున్న పట్టు పరిశ్రమ అధికారి

'హైదరాబాద్ నుంచి వచ్చే బస్సును సోనాల వరకు నడపండి'



సోనాల బోర్డు వేసుకుని వెళుతున్న బస్సు

బోథ్, జూన్ 17: ప్రతీరోజు రాత్రికి హైదరాబాద్‌కు బోథ్ నుంచి వెళ్లే బస్సు తిరుగు ప్రయాణంలో బోథ్ మండలంలోని సోనాల వరకు వస్తున్నట్లు బోర్డు వేసుకుని వెళుతున్న నిర్మల్ వరకే పరిమితమైందని బోథ్ మండల ప్రాంత ప్రయాణికులు వాపోతున్నారు. బస్సు నడపకపోవడం వల్ల ఉదయం పూట బోథ్ ప్రాంతానికి వచ్చే ప్రయాణికులకు ఇబ్బందులు పడాల్సి వస్తుందని అంటున్నారు. అంతేకాకుండా ఉదయం పూట మూడున్నర గంటలకు నిర్మల్‌లో దిగి బోథ్‌కు వచ్చే ప్రయాణికులు.. బస్సు కోసం ఉదయం 5గంటల వరకు వేచిచూడాల్సి వస్తుందన్నారు.

'కార్మికుల సమస్యలు పరిష్కరించాలి'

ఆదిలాబాద్ రూరల్, జూన్ 17: రాష్ట్రంలో కార్మికుల ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను చర్చించి పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కోశాధికారి వంగూరు రాములు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం జిల్లాకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం ఫలితంగా పేరుకుపోయిన కార్మిక ఉద్యోగుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర వ్యాప్తంగా స్కీం వర్కర్లు కార్మికులు ఉద్యోగులు చేపట్టిన సమ్మెల సందర్భంగా ఇచ్చిన హామీలను అధికారంలోకి వచ్చి ఆరు నెలలు గడుస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని పలు అంశాలపై మాట్లాడారు. ఇందులో రాష్ట్ర కార్యదర్శి కూరపాటి రమేష్, రాష్ట్ర కమిటీ సభ్యుడు యాటల సోమన్న, సీఐటీయూ అధ్యక్ష, కార్యదర్శులు బొజ్జ ఆశన్న, అన్నమొల్ల కిరణ్, కోశాధికారి కె.సునీత, ఉపాధ్యక్షుడు లింగాల చిన్నన్న, తదితరులు పాల్గొన్నారు.

టమాటా @80

- నాలుగు రోజుల్లో కిలో టమాటా ధర రెట్టింపు

ఇచ్చోడ, జూన్, 17: సామాన్యుల జేబుకు చిల్లు పెట్టేందుకు తయారైంది టమటా.. వారం రోజుల నుంచి టమాటా ధర మార్కెట్‌లో పుంజుకుంటుంది. ప్రస్తుతం మార్కెట్‌లో టమాటా రేట్ చూస్తే అమ్మో అనిపించకమానదు. నాలుగు రోజుల క్రితం రూ.30 నుంచి 40 కిలో పలికిన టమాటా సోమవారం ఇచ్చోడ వారసంతలో ఏకంగా 80రూపాయలు పలికింది. చిన్న మార్కెట్‌లో 80 ధర ఉండగా.. పెద్ద మార్కెట్‌లో 80 నుంచి 90 రూపాయలు రికార్డుస్థాయి. గతేడాది టమాటా సాగుచేసిన రైతులు కిలో రూ.200 పలకడంతో కోటీశ్వరులు, లక్షాధికారులు అయ్యారు. గతేడాది కూడా సరిగ్గా ఇదే సమయంలో టమాటా ధరలు ఒక్కసారిగా పెరిగాయి. దాంతో టమాటా సాగు చేసిన రైతుల పంట పండితే.. సామాన్యులు మాత్రం టమాటాను చూస్తేనే భయపడ్డారు. అదే సీన్ ఈ ఏడాది మళ్లీ రిపిట్ అయ్యే అవకాశాలు అధికంగా కనిపిస్తున్నాయి.





మార్కెట్‌లో టమాటాకు భారీ డిమాండ్